# అక్షరశక్తి

The Power of Pen

Evening Daily

సంపుటి: 20 | సంచిక: 300 | వరంగల్ | గురువారం, 03 సెప్టెంబర్ 2026 | పేజీలు: 07


## ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం

### విద్యార్థుల ఆరోగ్యం, ఏకాగ్రతే లక్ష్యం



2

## కొండా సురేఖ బర్తరఫ్

### గవర్నర్‌కు లేఖ పంపిన సీఎం రేవంత్‌రెడ్డి

- సుస్మితాపటేల్ వ్యాఖ్యలతో మొదలైన దుమారం
- కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం సీరియస్
- చివరకు మంత్రిపదవి నుంచి బర్తరఫ్ చేస్తూ నిర్ణయం
- తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం



4

తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. మంత్రి కొండా సురేఖ రాజీనామా చేస్తారా?.. బర్తరఫ్ చేస్తారా? అంటూ కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. సురేఖను బర్తరఫ్ చేసేందుకు హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి ఆమోద ముద్ర లభించగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేస్తూ సిఫారసు లేఖను గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు పంపించారు. రాజీనామాకు కొండా సురేఖ అంగీకరించకపోవడంతో ఆమెను తొలగించాలని సీఎం సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. మరోవైపు చిన్నారెడ్డిపై కాంగ్రెస్ ప్రభుత్వం వేటు వేసింది. ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ పదవి నుంచి చిన్నారెడ్డిని తొలగిస్తూ నిర్ణయం తీసుకుంది. ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మి నియమించింది. మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద, కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్‌పర్సన్‌గా గుండు సుధారాణిని నియమిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. - అక్షరశక్తి, హైదరాబాద్

## అన్యాయంగా తొలగించారు

- కనీసం వివరణ కూడా అడుగలేదు
- మంత్రులెవరూ సంతోషంగా లేరు
- అందరూ బయటకు వచ్చి మాట్లాడాలి
- వేం, పొంగులేటి, తిరుపతి రెడ్డి, కొండల్ రెడ్డి ఏకమై ఇబ్బంది పెట్టారు
- బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేసి నన్ను బర్తరఫ్ చేయించారు
- మీడియాతో కొండా సురేఖ



దేవాదాయ శాఖ మంత్రిగా తనను బర్తరఫ్ చేయడంపై కొండా సురేఖ స్పందించారు. తనను అన్యాయంగా పదవి నుంచి తొలగించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఉరిశిక్ష పడిన వ్యక్తికీ చివరిసారిగా ఏదైనా చెప్పుకునే అవకాశం ఇస్తారని, తనకు మాత్రం ఎలాంటి అవకాశం ఇవ్వకుండా శిక్షించారని అన్నారు.
- అక్షరశక్తి, హైదరాబాద్

3

## సీఎంకు, ఎమ్మెల్యేకు సోయి లేదా..

### ఆస్పత్రి ఓపెన్ చేసి వదిలేస్తారా?..

- వారం రోజుల్లో ఆస్పత్రిని అందుబాటులోకి తేవాలి
- లేదంటే హాస్పిటల్ ఎదుట ధర్నా చేస్తాం.
- పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

3



పరకాల 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రిని పనులు పూర్తికాకుండానే హంగామా చేస్తూ ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సోయి లేదా? స్థానిక ఎమ్మెల్యేకు సోయి లేదా అని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ప్రశ్నించారు. గురువారం పరకాల ప్రభుత్వ ఆస్పత్రిని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సందర్శించి విచారం వ్యక్తం చేశారు.ఒకే బెడ్డుపై ఇద్దరు ముగ్గురు పేషెంట్లను ఉంచి చికిత్స అందిస్తుంటే బాధేసిందన్నారు. - అక్షరశక్తి, పరకాల

## కుడా చైర్‌పర్సన్‌గా జి సుధారాణి నియామకం

### ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం



**అక్షరశక్తి, వరంగల్ :** కాకతీయ పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థ (కుడా) చైర్‌పర్సన్‌గా మాజీ రాజ్యసభ ఎంపీ, గ్రేటర్ వరంగల్ మాజీ మేయర్ గుండు సుధారాణిని నియమిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ జీవో నంబర్ 1291ను బుధవారం విడుదల చేసింది. బాధ్యతలు స్వీకరించిన తేదీ నుండి రెండేళ్ల పాటు ఆమె ఈ పదవిలో కొనసాగనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆమె నియామకానికి సంబంధించిన నియమ నిబంధనలను మెట్రోపాలిటన్ ఏరియా, అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ విడిగా జారీ చేయనున్నట్లు ఉత్తర్వుల్లో తెలిపారు.



## పాఠశాలల్లో బ్రేక్ ఫాస్ట్ ప్రారంభం

**అక్షరశక్తి, హనుమకొండ:** ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఇకపై మధ్యాహ్న భోజనం పథకం తో పాటుగా అల్పాహారం కూడా అందించనున్నారు. ఇందులో భాగంగా ధర్మసాగర్ మండలం సాయిపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి గురువారం ప్రారంభించారు. ముందుగా ఉన్నత పాఠశాలలో, తదుపరి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఇడ్లీ సాంబార్ తో ఉన్న అల్పాహారాన్ని జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందించారు. ఎంతమంది విద్యార్థులు హాజరయ్యారనే వివరాలను ప్రధానోపాధ్యాయులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక పాఠశాలకు ఎఫ్ఎల్ఎన్ మెటీరియల్ వచ్చిందా అని, రెమెడియల్ తరగతులు నిర్వహిస్తున్నారని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాపురావును కలెక్టర్ అడిగారు. ఎఫ్ఎల్ఎన్ వర్క్ బుక్ ను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం పాఠశాలల ప్రాంగణంలోనే ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఎంతమంది చిన్నారులు హాజరయ్యారని కలెక్టర్ ఆరా తీశారు. అంగన్వాడి కేంద్రంలోని చిన్నారులతో కలెక్టర్ మాట్లాడుతూ... రైమ్స్ వచ్చా అని, చార్టు, గోడలపై వేసిన పక్షులు, జంతువులు బొమ్మలను చూపిస్తూ వాటి పేర్లు చెప్పాలని అనగా చిన్నారులు వాటి పేర్లను తెలియజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అడాలి లక్ష్మి, డీఈవో గిరిరాజు గౌడ్, తహసిల్దార్ బావ్ సింగ్, ఎంఈఓ శ్రీదేవి, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రశాంతి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్పర్సన్ రమాదేవి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి: మంత్రి సీతక్క

**అక్షరశక్తి, ఏటూరునాగారం:** మహిళలు నైపుణ్యాలను పెంపొందించుకొని స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. ఏటూరునాగారం మండల కేంద్రంలో దుస్తులు, జూట్ బ్యాగుల తయారీ యూనిట్లను ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి ప్రారంభించిన మంత్రి మాట్లాడుతూ మహిళా సంఘాలకు బ్యాంకుల ద్వారా వడ్డీలేని రుణాలు అందిస్తూ స్వయం ఉపాధికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందన్నారు. రూ.10 లక్షలతో ఆధునిక యంత్రాలు సమకూర్చినట్లు తెలిపారు. ములుగు నియోజకవర్గంలో ప్రైవేటు సంస్థల సహకారంతో సుమారు 2,000 మంది మహిళలకు శిక్షణ ఇచ్చామని సీతక్క తెలిపారు. శిక్షణ పొందిన వారికి మహిళా సంఘాలు, గ్రామీణాభివృద్ధి శాఖ, ఐటీడీఏ ద్వారా కుట్టు యంత్రాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని, బీసీ సంక్షేమ శాఖ ద్వారా నియోజకవర్గానికి 1,000 కుట్టు యంత్రాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. పాఠశాలలు, వసతిగృహాలు, అంగన్‌వాడీల ఏకరూప దుస్తుల కుట్టు పనులను మహిళలకు అప్పగించి ఉపాధి అవకాశాలు పెంచుతామన్నారు. ఇప్పపువ్వు, తేనె, విస్తరాకుల వంటి అటవీ ఉత్పత్తులతో స్థానికంగానే ఆదాయ మార్గాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. అనంతరం ఐటీడీఏ సమావేశ మందిరంలో 10 మంది విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, ఏటూరునాగారం మండలంలోని 1,219 మంది లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను మంత్రి పంపిణీ చేశారు. ఐటీడీఏ పరిధిలోని ఉమ్మడి వరంగల్ జిల్లాలో తొలిసారిగా ఎంపిక చేసిన 11 ఉత్తమ పాఠశాలలకు సంబంధించిన అవార్డులను ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. జిల్లాలో ఏయే ప్రాంతాల్లో ఎలాంటి అటవీ ఉత్పత్తులు లభిస్తున్నాయి, వాటితో ఎలాంటి వస్తువులు తయారు చేయవచ్చనే అంశాలపై అధ్యయనం చేసి స్థానిక వనరులతో ఉపాధి అవకాశాలను గుర్తించాలని అధికారులను ఆదేశించారు.







# ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం

**విద్యార్థుల ఆరోగ్యం, ఏకాగ్రతే లక్ష్యం**

**అక్షరశక్తి,హన్మకొండ:** దేశంలోనే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పోషక విలువలతో కూడిన అల్పాహారం అందిస్తున్న తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. ధర్మసాగర్ మండలం కాషాగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయితో కలిసి ఆయన ప్రారంభించారు. విద్యార్థులకు ఎమ్మెల్యే, కలెక్టర్ స్వయంగా అల్పాహారం వడ్డించి, వారితో కలిసి భోజనం చేస్తూ ముచ్చటించారు. పాఠశాల ఆవరణలో రూ.12 లక్షలతో నిర్మించనున్న అంగన్‌వాడీ భవనానికి శంకుస్థాపన చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యారంగానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ, పేద, మధ్యతరగతి విద్యార్థులు ఉదయం ఆకలితో ఉండకుండా పోషకాహారం అందించడంతో పాటు చదువుపై ఏకాగ్రత పెంచే ఉద్దేశంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టారని కడియం శ్రీహరి తెలిపారు. వారంలో రోజుకో రకంగా బోండా, పూరీ, ఉప్మా, ఇడ్లీ, వడ తదితర అల్పాహారం అందిస్తామని, ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నామని చెప్పారు.

కాషాగూడెం పాఠశాలలో ప్రస్తుతం సుమారు 90-92 మంది విద్యార్థులు ఉన్నారని, గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు పాఠశాలను ఉన్నత ప్రాథమిక పాఠశాలగా అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే తెలిపారు. అప్‌గ్రేడ్ అనంతరం అదనపు తరగతి గదులు, ఉపాధ్యాయులు, ఇంగ్లిష్ మీడియం బోధనకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. గ్రామంలో రూ.11 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించామని, రూ.12 లక్షలతో అంగన్‌వాడీ భవనం నిర్మిస్తున్నామని, ఇప్పటికే ఏడు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని చెప్పారు. అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో, హౌసింగ్ అధికారులు, సర్పంచ్‌కు సూచించారు. పూరిగుడిసెలు, కవర్లతో నివసిస్తున్నవారు, ఇళ్లులేని కుటుంబాల వివరాలు సేకరించి ప్రతిపాదనలు పంపాలన్నారు. రాష్ట్రంలో రెండు విడతల్లో సుమారు ఏడు లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, రూ.35 వేల కోట్ల వరకు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. కొత్త రేషన్ కార్డులు జారీ చేసి సుమారు 3.10 కోట్ల మందికి సన్నబియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నామని, ఇందుకు ఏటా రూ.13,800 కోట్లు ఖర్చు చేస్తున్నామని చెప్పారు.

ప్రజలు మద్యం వంటి వ్యసనాలకు డబ్బు ఖర్చు చేయకుండా కుటుంబ అవసరాలు, పిల్లల చదువులు, భవిష్యత్తు కోసం ఆదా చేసుకోవాలని కడియం శ్రీహరి సూచించారు. కాషాగూడెం పేరును కాసీంనగర్‌గా మార్చాలని, కొత్తగా ఏర్పడిన గ్రామానికి గ్రామపంచాయతీ భవనం మంజూరు చేయాలని, అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ ధర్మసాగర్ మండలంలో ఈ గ్రామం నుంచి అల్పాహార పథకాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. జిల్లాలో ఇప్పటికే నాలుగు మండలాల్లో పథకం ప్రారంభమైందని, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందిస్తూ దేశంలో ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. హరేకృష్ణ సంస్థ ఆధ్వర్యంలో ప్రతిరోజూ తాజా ఆహారాన్ని బోండా, పూరీ, ఇడ్లీ, మిల్లెట్ ఉప్మా తదితర మెనూతో అందిస్తున్నామని తెలిపారు. పాఠశాల విద్యార్థులకు ఉచిత యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ అందిస్తున్నామని, కంప్యూటర్లు ఏర్పాటు చేసి ప్రాథమిక స్థాయి నుంచే కంప్యూటర్ విద్యకు అవకాశం కల్పించామని చెప్పారు.

ఫౌండేషన్ లెర్నింగ్‌కు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, ఐదో తరగతి నాటికి విద్యార్థులకు ప్రాథమిక ఇంగ్లిష్, గణితం, కూడిక, తీసివేత, గుణకారం తదితర అంశాల్లో పట్టు సాధించేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు రెమెడియల్ తరగతులు నిర్వహిస్తూ అవసరమైన విద్యార్థులకు అదనపు బోధన అందిస్తున్నామన్నారు. అల్పాహారం అందించడం వల్ల విద్యార్థులకు పోషకాహారంతో పాటు చదువుపై ఏకాగ్రత పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సయ్యద్ సత్తార్, డీఈవో గిరిరాజ్ గౌడ్, తహసిల్దార్ బావ్ సింగ్, ఎంపీడీవో అనిల్ కుమార్, ఎంఈఓ శ్రీదేవి, ప్రధానోపాధ్యాయురాలు యాస్మిన్ జహాన్, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బలం

- **సంక్షేమమ పథకాలే మన ఆయుధం**
- **పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి**




**అక్షరశక్తి, పరకాల :** పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన భారీ ర్యాలీ కార్యక్రమాన్ని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం అక్కడి నుండి శ్రీ కుంకుమేశ్వర దేవస్థానం నుండి వెల్లంపల్లి రోడ్డు, ఆర్టిసి బస్టాండ్ మీదుగా హుజురాబాద్ రోడ్ మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ భారీ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో సెప్టెంబర్ 1వ తేదీ నాటికి విజయవంతంగా 1000 రోజులు మైలురాయిని కాంగ్రెస్ ప్రభుత్వం చేరుకుందని అన్నారు. మన ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో 25 లక్షలకు పైగా రైతు కుటుంబాలకు రూ 2 లక్షల వరకు రుణ విముక్తి చేసామన్నారు. రైతు భరోసా కింద రూ 36వేల కోట్లపైగా పెట్టుబడి సాయం అందించామని అన్నారు. 500రూ గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇండ్లు, 72వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ, సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం, 15.46 లక్షల కొత్త రేషన్ కార్డులను జారీ చేసామన్నారు. స్కూల్ విద్యార్థులకు డైట్ చార్జీల పెంపు, పార్టీలకు అతీతంగా సీఎంఆర్ చెక్కులు, కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్నమని అన్నారు. పరకాలను విద్యా కేంద్రంగా అభివృద్ధి చేస్తామని, ఇందులో భాగంగానే యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్, టాస్క్, సెంటర్ లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. తెలంగాణ సెంటిమెంట్ తో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పార్టీ 10 సంవత్సరాల కాలంలో ధనిక రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చారన్నారు. మాజీ ఎమ్మెల్యే చల్ల ధర్మారెడ్డి నీవు ప్రజా ప్రతినిధిగా పనికిరావు, వ్యాపారవేత్త పనికి వస్తావు, అభివృద్ధి ముసుగులో అందినంత దోచుకుతున్నావ్, చల్లా ఇన్ఫ్రా పేరుతో ప్రజాధనాన్ని దోచుకుతున్నావు అని, తక్కువ ధరలకు భూములు కొని ప్రభుత్వ సొమ్ముతో రోడ్డు వేసి ఎక్కువ ధరలకు అమ్ముకున్న చరిత్ర నీదని విమర్శించారు.

# సీఎంకు, ఎమ్మెల్యేకు సోయి లేదా..

- ఆస్పత్రి ఓపెన్ చేసి వదిలేస్తారా?..
- వారం రోజుల్లో ఆస్పత్రిని అందుబాటులోకి తేవాలి
- లేదంటే హాస్పిటల్ ఎదుట ధర్నా చేస్తాం.
- పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి





**అక్షరశక్తి, పరకాల :** పరకాల 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రిని పనులు పూర్తికాకుండానే హంగామా చేస్తూ ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సోయి లేదా? స్థానిక ఎమ్మెల్యేకు సోయి లేదా అని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ప్రశ్నించారు. గురువారం పరకాల ప్రభుత్వ ఆస్పత్రిని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సందర్శించి విచారం వ్యక్తం చేశారు.ఒకే బెడ్డుపై ఇద్దరు ముగ్గురు పేషెంట్లను ఉంచి చికిత్స అందిస్తుంటే బాధేసిందన్నారు. ఇలాంటి పరిస్థితులు ప్రజలకు రావొద్దనే పరకాల ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ గారి చొరవతో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రిని మంజూరు చేశారని ధర్మారెడ్డి తెలిపారు.బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే ఆస్పత్రి నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయని పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆస్పత్రికి రంగులు వేసి, పనులు పూర్తికాకుండానే హడావుడిగా ప్రారంభించిందని ఆరోపించారు. ఆస్పత్రి ప్రారంభించి ఇన్ని రోజులు గడుస్తున్నా ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించలేదని విమర్శించారు. పూర్తిస్థాయిలో పనులు చేపట్టకుండా ముఖ్యమంత్రి ఆస్పత్రిని ప్రారంభించడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రారంభోత్సవం రోజే ఆస్పత్రికి అవసరమైన నిధులను ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు.వారం రోజుల్లోగా 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రిని పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆస్పత్రిని సందర్శించి, ప్రజల తరపున ధర్నాకు దిగుతారని చల్లా ధర్మారెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అన్యాయంగా తొలగించారు

- కనీసం వివరణ కూడా అడుగలేదు
- మంత్రులెవరూ సంతోషంగా లేరు
- అందరూ బయటకు వచ్చి మాట్లాడాలి
- వేం, పొంగులేటి, తిరుపతి రెడ్డి, కొండల్ రెడ్డి ఏకమై ఇబ్బంది పెట్టారు
- బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేసి నన్ను బర్తరఫ్ చేయించారు
- మీడియాతో కొండా సురేఖ



**అక్షరశక్తి, హైదరాబాద్:** దేవాదాయ శాఖ మంత్రిగా తనను బర్తరఫ్ చేయడంపై కొండా సురేఖ స్పందించారు. తనను అన్యాయంగా పదవి నుంచి తొలగించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఉరిశిక్ష పడిన వ్యక్తికీ చివరిసారిగా ఏదైనా చెప్పుకునే అవకాశం ఇస్తారని, తనకు మాత్రం ఎలాంటి అవకాశం ఇవ్వకుండా శిక్షించారని అన్నారు. తన కుమార్తె కొండా సుస్మిత పటేల్ వ్యాఖ్యలకు తనను శిక్షించడం ఏంటని.. ఆమె అభిప్రాయంతో తనకేం సంబంధమని కాంగ్రెస్ పెద్దలను సురేఖ సూటిగా ప్రశ్నించారు. రాజీనామా చేయమంటే చేసేదాన్నని, తన వివరణ అడిగి చర్యలు తీసుకుంటే బాగుండేదన్నారు. నిజంగా తాను తప్పు చేసి ఉంటే బర్తరఫ్ చేసినా పర్వాలేదని కొండా సురేఖ చెప్పుకొచ్చారు.

ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. 'మంత్రి పదవి నాకు ఆభరణం మాత్రమే. కారణం చెప్పకుండా తొలగించడం బాధాకరం. గతంలో మంత్రి పదవికి స్వయంగా నేనే రాజీనామా చేశా. ప్రస్తుతం మంత్రులు సంతోషంగా లేరు. ఈ విషయం గుండెపై చేయి వేసుకొని వారు చెప్పాలి. మంత్రులంతా బయటకు వచ్చి మాట్లాడాలి. పనులు కావాలంటే ఎవరి వద్దకు వెళ్లాలో అర్థం కాదు. ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని కోరుతున్నాను. నేను పార్టీని, ప్రభుత్వాన్ని ఏం అనలేదు. మల్లు రవి కూడా ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీని తిట్టినవారే. ఇందిరాగాంధీని జైపాల్ రెడ్డి తిట్టారు. రోశయ్య సైతం ఇందిరాగాంధీని తిట్టారు. సీఎం రేవంత్‌పై ఆరోపణలు చేసిన వారికీ పదవులు ఇచ్చి సన్మానం చేశారు. ఎవరి అండ లేకుండా మేం పైకి వచ్చాం. నా భర్తను కారులో ఎక్కించుకొని వరంగల్ అంతా తిప్పారు. మా కాళ్లు మొక్కి మాతో ప్రచారం చేయించుకున్న వాళ్లూ మమ్మల్ని తిడుతున్నారు. మా నియోజకవర్గంలో ఉన్న ఎమ్మెల్సీకి వాళ్ల భార్య కూడా ఓటేయదు. నన్ను తొలగించాలనే ఆలోచన ఏఐసీసీకి లేదు. బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేసి నన్ను బర్తరఫ్ చేశారు. వేం, పొంగులేటి, తిరుపతి రెడ్డి, కొండల్ రెడ్డి ఏకమై నన్ను ఇబ్బంది పెట్టారు. డబ్బులు వసూలు చేసిన వాడే నా మాజీ ఓఎస్డీ సుమంత్‌పై కేసు పెట్టాడు. సుమంత్ పేరు చెప్పి కిరణ్ అనే వ్యక్తి డబ్బులు వసూలు చేశాడు. తమ ప్రభుత్వంలో తమ మనుషులను ఇబ్బంది పెట్టుకోవడం చరిత్రలో ఎక్కడా లేదు. సుమంత్‌ని ఇబ్బంది పెట్టడం ఆపేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా. కాంగ్రెస్ సర్కార్ సరిదిద్దుకోవాల్సిన, మార్చుకోవాల్సిన అంశాలు కొన్ని ఉన్నాయి.

ప్రభుత్వం మళ్లీ రావాలంటే చాలా మార్పులు జరగాలి. మోనోపాలీ లాగా వెళ్లడం సరైంది కాదు. తనకు తానే ముఖ్యమంత్రి అని చెప్పుకోవడం సరికాదు. నిర్ణయాలు తీసుకునేప్పుడు చర్చించాలి. ఎమ్మెల్యేగా ఉంటాను.. నియోజకవర్గ ప్రజలకు సేవ చేస్తాను. నాకు పార్టీలో ఇబ్బంది అవుతుందని అనుకుంటున్నా. నా కూతురు వ్యాఖ్యలను నేను ఖండిస్తే ఆమెను కించపరిచినట్టు అవుతుంది. మంత్రిగా తొలగించడం అవమానమని అనుకోవడం లేదు. నేను తప్పు చేస్తే ఇబ్బంది పడేదాన్ని. తప్పు చేయకుండా బర్తరఫ్ చేయడం పార్టీ తప్పు. రేవంత్ రెడ్డి, వైఎస్ రాజశేఖర్ రెడ్డికి తేడా ఉంది' అని అన్నారు.

## ఎంజీఎంలో ఆధునికీకరించిన అడిక్షన్ ట్రీట్మెంట్ కేంద్రం ప్రారంభం





**అక్షరశక్తి,వరంగల్:** ఎంజీఎం ఆసుపత్రిలో ఆధునికీకరించిన అడిక్షన్ ట్రీట్మెంట్ ఫెసిలిటీ (ఏటీఎఫ్) కేంద్రాన్ని ప్రారంభించారు. ఈగల్ ఫోర్స్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో పడకల సామర్థ్యాన్ని 10 నుంచి 20కి పెంచడంతో పాటు సీసీటీవీ నిఘా, భద్రతా ఏర్పాట్లు, పరిశుభ్రమైన వాతావరణం, క్యారమ్, చెస్ వంటి వినోద సౌకర్యాలను కల్పించారు. మద్యం, పొగాకు, గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు బానిసైన వారికి అనుభవజ్ఞులైన వైద్యుల పర్యవేక్షణలో చికిత్స, కౌన్సెలింగ్ అందించనున్నారు. మత్తుకు బానిసైన వారిని తిరిగి ఆరోగ్యకరమైన, బాధ్యతాయుతమైన జీవితంలోకి తీసుకురావడమే కేంద్రం లక్ష్యమని పోలీసులు తెలిపారు. నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ద్వారా వ్యసన బాధితులకు సకాలంలో చికిత్స అందించేందుకు చర్యలు చేపట్టినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత తెలిపారు. పిల్లలు లేదా కుటుంబ సభ్యులు మత్తు పదార్థాలకు బానిసైనట్లు గుర్తిస్తే సమస్యను దాచిపెట్టకుండా వెంటనే చికిత్స, కౌన్సెలింగ్ పొందాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, ఎంజీఎం సూపరింటెండెంట్ డా. రాంరెడ్డి, ఆర్ఎంవో అశ్వని కుమార్, ఏసీపీ మధుసూదన్, డ్రగ్స్ కంట్రోల్ టీమ్ ఇన్‌స్పెక్టర్ సాయిరాం, ఆర్ఐ శివకేశవులు తదితరులు పాల్గొన్నారు. మాదకద్రవ్యాల వ్యసనానికి సంబంధించిన సహాయం కోసం 87125 84473, 87126 85299 నంబర్లను సంప్రదించాలని పోలీసులు సూచించారు.

## కార్మిక వ్యతిరేక విధానాలపై సంఘటితంగా పోరాడుదాం

**అక్షరశక్తి, హన్మకొండ :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై సంఘటితంగా పోరాడాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టి.యు.సి.ఐ) హన్మకొండ నగర ఉపాధ్యక్షులు ఎం.డి.యాకుబ్ పాషా అన్నారు. గురువారం హన్మకొండ లోని డబ్బాల సెంటర్ లో సెప్టెంబర్ 6న ఖమ్మం జిల్లా కేంద్రంలో జరిగే టి.యు.సి.ఐ.రాష్ట్ర జనరల్ కౌన్సిల్ ను జయప్రదం చేయాలని కోరుతూ "కరపత్రాలు ఆవిష్కరించి" ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.డి యాకుబ్ పాషా మాట్లాడుతూ కార్మికోద్యమ నిర్మాణానికి రాష్ట్ర జనరల్ కౌన్సిల్ కు 30 జిల్లాల నుండి ఎంపిక చేసిన ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఖమ్మంలో జరిగే రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాలలో ప్రస్తుత పరిస్థితులు, సమస్యలు చర్చించి భవిష్యత్తు ఉద్యమ కర్తవ్యాలను చేపట్టనున్నామని ఆయన తెలిపారు. ఈ కౌన్సిల్ కు ప్రముఖ విద్యావేత్త ఐ. వి. రమణ రావు "కార్మిక ఉద్యమం కర్తవ్యాలు" అంశంపై బోధించనున్నారని, యూనియన్ అఖిలభారత ఉపాధ్యక్షులు వనమాల కృష్ణ, రాష్ట్ర, అధ్యక్ష కార్యదర్శులు కే. సూర్యం ,ఎస్.ఎల్. పద్మ తదితరులు ప్రసంగించనున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టి.యు.సి.ఐ. హన్మకొండ నగర కమిటీ నాయకులు శ్రీకాంత్, బండి కుమార్, బిక్షపతి, కొమురయ్య, నాగేశ్వర్, రాములు, పాపన్న, కొమ్మలు, వెంకటాద్రి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



# కొండా సురేఖ బర్తరఫ్

## గవర్నర్‌కు లేఖ పంపిన సీఎం రేవంత్‌రెడ్డి
## సుష్మితాపటేల్ వ్యాఖ్యలతో మొదలైన దుమారం
## కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం సీరియస్
## చివరకు మంత్రిపదవి నుంచి బర్తరఫ్ చేస్తూ నిర్ణయం
## తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం



**అక్షరశక్తి, హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. మంత్రి కొండా సురేఖ రాజీనామా చేస్తారా?.. బర్తరఫ్ చేస్తారా? అంటూ కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. సురేఖను బర్తరఫ్ చేసేందుకు హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి ఆమోద ముద్ర లభించగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేస్తూ సిఫారసు లేఖను గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు పంపించారు. రాజీనామాకు కొండా సురేఖ అంగీకరించకపోవడంతో ఆమెను తొలగించాలని సీఎం సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. మరోవైపు చిన్నారెడ్డిపై కాంగ్రెస్ ప్రభుత్వం వేటు వేసింది. ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ పదవి నుంచి చిన్నారెడ్డిని తొలగిస్తూ నిర్ణయం తీసుకుంది. ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మి నియమించింది. మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద, కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్‌పర్సన్‌గా గుండు సుధారాణిని నియమిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

### సుష్మితాపటేల్ వ్యాఖ్యలతో దుమారం..

పరకాల సభలో మళ్లీ రేవూరిని గెలిపించాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మంత్రి కొండా సురేఖ కూతురు సుష్మితపటేల్ చేసిన సంచలన వ్యాఖ్యలతో దుమారం మొదలైంది. పరకాల నియోజకవర్గం నుంచి కచ్చితంగా స్వతంత్ర (ఇండిపెండెంట్) అభ్యర్థిగా బరిలోకి దిగుతానని హెచ్చరించారు. కాంగ్రెస్ టికెట్ ఇచ్చినా, ఇవ్వకపోయినా ప్రజల మద్దతుతో పోటీ చేస్తానని ప్రకటించారు. సీఎం అయ్యాక.. కళ్లు నెత్తికెక్కాయా..అంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. అంతేగాకుండా, సీఎం కుటుంబ అవినీతి ఆరోపణలను, అలాగే సీఎం రేవంత్ బాగోతాలు, ఆయన సోదరుల బాగోతాలు బయటపెడతానని సవాల్ విసిరారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిల మధ్య అసలు ముఖ్యమంత్రి ఎవరనే స్పష్టత లేదని విమర్శించారు. సుస్మిత వ్యాఖ్యలపై తెలంగాణ కాంగ్రెస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పీసీసీ క్రమశిక్షణా కమిటీ మంత్రి కొండా సురేఖకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలతో తనకు ఎలాంటి సంబంధం లేదని, అవసరమైన వివరణ ఇప్పటికే క్రమశిక్షణా కమిటీకి ఇచ్చానని కొండా సురేఖ తెలిపారు. ఈ పరిణామాల నేపథ్యంలో చివరకు కొండా సురేఖను బర్తరఫ్ చేస్తూ పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది.

**చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలేంటి..?**

కాంగ్రెస్ సీనియర్ నేత, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి ఆగస్టు 16వ తేదీన వనపర్తి జిల్లా గోపాల్‌పేటలో కాంగ్రెస్ పార్టీ మండల కార్యాలయం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సొంత పార్టీకే చెందిన వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డిపై ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. మేఘారెడ్డి డబ్బులు ఇచ్చి ఎమ్మెల్యే టికెట్ తెచ్చుకున్నారంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. వనపర్తి ఎమ్మెల్యే టికెట్ తనకు ఇవ్వాలని రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ చెప్పారని చిన్నారెడ్డి అన్నారు. ఆయన వద్ద డబ్బు లేకపోతే మీరే ఖర్చు పెట్టుకోవాలని ఆదేశించారని పేర్కొన్నారు. అయితే, పార్టీలోని ఎన్నికల కమిటీ డబ్బులకు ఆశపడి తనకు టికెట్ ఇవ్వలేదని ఆరోపించారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన అనంతరం వనపర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్‌ను అవినీతి పార్టీగా మేఘారెడ్డి మార్చారని మండిపడ్డారు. తన పనులకూ ఆయన అడ్డుపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని.. తన ఓపిక నశిస్తే మరో జీవన్‌రెడ్డిలా మారి తిరగబడతానని చిన్నారెడ్డి హెచ్చరించారు.

# శిరీషను హత్య చేసిన సన ఉల్లాఖాన్‌ను కఠినంగా శిక్షించాలి



**అక్షరశక్తి, కొత్తగూడ :** మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలో ముస్మి, లడాయిగడ్డ, వాల్యాతండా, ముస్మి చిన్న తండాలలో ఆదివాసీ బిడ్డ ఊకె శిరీష హత్యని నిరసిస్తూ కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. ఊకె శిరీషని అత్యాచారం చేసి హత్య చేసి చంపిన సన ఉల్లాఖాన్ ని కఠినం గా శిక్షించాలని, పాస్ట్ ట్రాక్ కోర్ట్ ని ప్రభుత్వం ఏర్పాటు చేయాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీశైలం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. శిరీష కుటుంబన్ని ప్రభుత్వం ఉద్యోగం, నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పి ఓ డబ్ల్యు, పి వై ఎల్, ఐ ఎఫ్ టి యు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య నాయకులు మంగమ్మ, లలిత, సరోజ,శారద, అనిత, ఉప్పమ్మ, గట్టి లక్ష్మి, సునీతరాణి, కవిత చిలకమ్మా, పున్ని, భద్రి, లక్ష్మి, రమక్క, వినోద, రాజమల్లు, సురేందర్, నరేష్, సదయ్య,శంకర్ వెంకన్న, పూర్ణచందర్, రాజ, జామ్లా, మోహన్, రాంసింగ్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# సాఫ్ట్ బాల్ పోటీల్లో రాణించాలి

**సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సాంబమూర్తి**



**అక్షరశక్తి, హనుమకొండ:** జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో సాఫ్ట్ బాల్ క్రీడాకారులు రాణించాలని హనుమకొండ జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పెరుమాండ్ల సాంబమూర్తి కోరారు. తెలంగాణ రాష్ట్ర సాఫ్ట్ బాల్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ పిల్లి సాంబశివరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి తాబేటీ రాజేందర్ ఆదేశాలతో త్వరలో రాష్ట్రస్థాయిలో జరగనున్న సాఫ్ట్బాల్ సబ్ జూనియర్ మినీ సబ్ జూనియర్ బాలబాలికల పోటీలలో పాల్గొనడానికి జిల్లా జట్ల ఎంపిక కార్యక్రమాన్ని హనుమకొండలోని జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో గురువారం నిర్వహించారు. ఈ ఎంపికల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. దాదాపు 250 మంది క్రీడాకారులు పాల్గొని తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారనీ తెలిపారు. జవహర్లాల్ నెహ్రూ స్టేడియం సాఫ్ట్బాల్ కోచ్ పోలేపాక వినయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎంపిక ప్రక్రియలో హనుమకొండ జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు సుమలత, ఫిజికల్ డైరెక్టర్లు ఏ. సృజన, కుమార్, రాజేశ్వర్, తాబేటి నాగరాజు, శివకుమార్, కిరణ్మయి, రాజేశ్వరి, శోభారాణి, బుస్స రాజు, సందీప్, సీనియర్ క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అసైన్డ్ రైతులకు హక్కులు కల్పిస్తూ బిల్లు ప్రవేశ పెట్టాలి



**అక్షరశక్తి, ములుగు :** ములుగు జిల్లా కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన అసైన్డ్ రైతుల సమావేశంలో రాహుల్ గాంధీ సమక్షంలో వరంగల్ లో జరిగిన రైతు గర్జన సభలో నాటి పీసీసీ ప్రెసిడెంట్ నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసైన్డ్ రైతులకు తాము అధికారంలోకి వస్తే పూర్తి హక్కులు ఇస్తామని ప్రకటించడం జరిగిందని న్యాయవాది కలకోటి మహేందర్ గుర్తు చేశారు. కానీ నేటి వరకు అసైన్డ్ రైతుల ఊసే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎత్తటం లేదని ఆయన వాపోయారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అసైన్డ్ రైతులను మర్చిపోయారని ఆయన పేర్కొన్నారు. ఈ నెల ఏడో తారీఖు నుండి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో అసైన్డ్ రైతులకు పూర్తి హక్కులు కల్పిస్తూ బిల్లు ప్రవేశపెట్టాలని కలకోటి మహేందర్ న్యాయవాది అసైన్డ్ భూమి సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అసైన్డ్ రైతులకు ఇచ్చిన హామీలను నిర్లక్ష్యం చేసి మోసం చేస్తే అసైన్డ్ రైతుల నుండి భారీ ఎత్తున ఉద్యమం తప్పదని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు అవసరమైతే అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నిస్తామని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా జెఏసీ చైర్మన్ ముంజలా బిక్షపతి, నల్లబెల్లి మేఘం, బానోత్ విజయ, కన్నం రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీకి చిక్కిన అటవిశాఖ బీట్ అధికారి



**అక్షరశక్తి, భద్రాద్రి కొత్తగూడెం :** మరో ఇద్దరు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాది జిల్లా ఆలపల్లి మండలం కాచనాపల్లి గ్రామానికి చెందిన ఫారెస్టు బీట్ అధికారి బానోత్ రవికుమార్ , ప్రైవేట్ వ్యక్తి పఠాన్ సాధిక్ ఖాన్ అనే ఇద్దరిని పట్టుకున్నారు. అటవి శాఖ పరిధిలో ఉండే పోడు భూముల్లో వ్యవసాయం సాగుకు, ట్రెంచెస్ తవ్వకాలకు ఎలాంటి ఆటంకాలు సృష్టించవద్దని, పోడు భూములకు పట్టా చేసివ్వాలని ఫారెస్టు బీట్ అధికారిని మధ్యవర్తి ద్వారా సంప్రదించాడు. ఇందుకు రూ.30 వేలు డిమాండ్ చేశాడు. ఫిర్యాదుదారుడు ఏసీబీని ఆశ్రయించగా వారి వ్యూహం మేరకు రామానుజగూడెంలో అటవి అధికారి బానోత్ రవికుమార్ ఆదేశాల మేరకు మధ్యవర్తికి లంచం డబ్బు అందజేశాడు. వెంటనే ఏసీబీ అతడిపై దాడి చేసి రూ.30 వేలను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేసి , కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఏసీబీ అధికారులు వివరించారు.

# "బకాయిల్లో విద్యార్థుల భవిష్యత్తు"

విద్యార్థులకు ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం నేడు అనేక ప్రశ్నలను ఎదుర్కొంటోంది. 2020-21 నుంచి 2024-25 విద్యా సంవత్సరాల వరకు బకాయిలు పేరుకుపోవడం విద్యార్థులు, తల్లిదండ్రులు,ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలకు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థుల ఉన్నత విద్యకు ఈ పథకం ఎంతో కీలకం. ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజులు సకాలంలో అందకపోవడంతో కొన్ని కళాశాలలు విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఇది అదనపు ఆర్థిక భారంగా మారుతోంది. తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల సమస్య ఏళ్లుగా కొనసాగుతోంది. ప్రస్తుతం మొత్తం బకాయిలు రూ.8 వేల కోట్లకు పైగానే ఉన్నాయని ప్రభుత్వం చెబుతుండగా, 2025-26 వరకు కలిపితే రూ.10 వేల కోట్లకు పైగా ఉంటాయని కళాశాలల వర్గాలు పేర్కొంటున్నాయి. మరోవైపు ప్రభుత్వం కొత్త విద్యా సంవత్సరానికి సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానాలపై నిర్ణయాలు తీసుకుంటున్నప్పటికీ, గత బకాయిల పరిస్థితి మాత్రం స్పష్టంగా తేలాల్సి ఉంది. పాత బకాయిలను పూర్తిగా పరిష్కరించకుండా కొత్త విధానాలను ప్రకటించడం వల్ల సమస్య మరింత క్లిష్టమయ్యే ప్రమాదం ఉంది. ప్రభుత్వం ఇప్పటికే బకాయిల చెల్లింపుల కోసం భారీ మొత్తాలను విడుదల చేసినట్లు చెబుతున్నప్పటికీ, విద్యార్థుల ఖాతాలు, కళాశాలల బకాయిల స్థాయిలో పూర్తి పారదర్శకత అవసరం. ఫీజు రీయింబర్స్‌మెంట్ కేవలం ప్రభుత్వ ఆర్థిక పథకం కాదు. వేలాది మంది పేద విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన సామాజిక బాధ్యత. బకాయిల కారణంగా విద్యార్థుల చదువులు మధ్యలో ఆగకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి. అలాగే కళాశాలల వారీగా బకాయిలను గుర్తించి, దశలవారీగా కాకుండా నిర్ణీత కాలపట్టికతో చెల్లింపులు పూర్తి చేయాలి.బకాయిలు పేరుకుపోవడంతో ప్రైవేట్ కళాశాలలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఆ ప్రభావం చివరకు విద్యార్థులపైనే పడుతోంది. ఫీజులు చెల్లించాలంటూ ఒత్తిడి, సర్టిఫికెట్లు నిలిపివేయడం వంటి సమస్యలతో చదువు పూర్తిచేసిన విద్యార్థులు కూడా ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాల కోసం ఇబ్బందులు పడుతున్నారు.ప్రభుత్వం 2026-27 నుంచి ప్రతి విద్యా సంవత్సరానికి అవసరమైన నిధులను అదే ఏడాదిలో విడుదల చేసి, ఇకపై బకాయిలు పేరుకుపోకుండా చర్యలు తీసుకుంటామని ప్రకటించింది. నెలకు రూ.200 కోట్ల చొప్పున విడుదల చేసే కొత్త విధానాన్ని కూడా ప్రకటించింది.భవిష్యత్తులో ఇలాంటి బకాయిలు పేరుకుపోకుండా ప్రతి విద్యా సంవత్సరం ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి,నిధుల విడుదలకు పటిష్టమైన వ్యవస్థను రూపొందించాలి.విద్యార్థుల చదువు వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితిపై ఆధారపడకూడదు. ఫీజు రీయింబర్స్‌మెంట్ లెక్కలు స్పష్టమై, బకాయిలు పూర్తిగా తీరినప్పుడే ఈ పథకానికి నిజమైన అర్థం చేకూరుతుంది. ప్రభుత్వం ఇకనైనా కాలయాపనకు తావులేకుండా స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగాలి. అర్హులైన విద్యార్థుల బకాయిలను తక్షణమే చెల్లించాలి. ఏ విద్యార్థి సర్టిఫికెట్ ఫీజు బకాయి కారణంగా ఆగిపోకుండా స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలి. భవిష్యత్తులో ప్రతి ఏడాది ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో అందేలా ప్రత్యేక నిధి, పారదర్శక చెల్లింపు వ్యవస్థను ఏర్పాటు చేయాలి. పేద విద్యార్థుల భవిష్యత్తు బకాయిల లెక్కల్లో చిక్కుకోకుండా చూడటమే ప్రభుత్వానికి ముందున్న అసలు బాధ్యత.



- డా.మోటె చిరంజీవి,
సామాజిక వేత్త,విశ్లేషకులు.
సెల్ : 9949194327.

# కాంగ్రెస్ లక్ష్మణ రేఖ దాటితే చర్యలు తప్పవు

**కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి**



**అక్షరశక్తి, హైదరాబాద్ :** కాంగ్రెస్ లక్ష్మణ రేఖ దాటితే ఎంతటి వారిపై అయినా చర్యలు ఉంటాయని తెలంగాణ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి తేల్చి చెప్పారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై తీసుకున్న చర్యలే ఇందుకు ఉదాహరణ అని అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ లైన్ దాటిన కొండా సురేఖ, చిన్నారెడ్డిని పదవుల నుంచి తొలగించారని చెప్పారు. దీనిపై ఇప్పటికే ఆలస్యంగా నిర్ణయం తీసుకున్నామని చాలా మంది తమను ప్రశ్నించినట్లు ఆయన చెప్పుకొచ్చారు. ప్రజాస్వామ్యయుతంగా సమస్యను పరిష్కరించాలనే ఆలస్యమైందని మల్లు రవి తెలిపారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ హయాంలో రాజయ్యను సమాచారం లేకుండానే ఉప ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించారని మల్లు రవి గుర్తు చేశారు. కొండా సురేఖ, చిన్నారెడ్డిపై వచ్చిన ఆరోపణలతో క్రమశిక్షణా కమిటీ నివేదిక రూపొందించి కాంగ్రెస్ అధిష్ఠానానికి ఇచ్చిందన్నారు. ఇద్దరి వ్యాఖ్యలను పరిశీలించి సీరియస్ యాక్షన్ తీసుకోవాలని కోరినట్లు ఆయన చెప్పుకొచ్చారు. తెలంగాణ కాంగ్రెస్ కేడర్‌కు సందేశం వెళ్లేలా చర్యలు ఉండాలని విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ రేఖ దాటితే ఎంతటి వారైనా చర్యలు ఉంటాయని తెలిసేలా ఏఐసీసీ చర్యలు తీసుకుందని రవి వివరించారు.

కేసీ వేణుగోపాల్ విదేశాల్లో ఉండటంతో ఈ అంశంపై నిర్ణయం ఆలస్యమైందని మల్లు రవి తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే రెండు సార్లు కలిసే అవకాశం ఇచ్చారని, దీంతో కొండా సురేఖ తన వాదనను అధిష్ఠానానికి చెప్పుకున్నారని పేర్కొన్నారు. వారి మధ్య ఏం చర్చలు జరిగాయో తెలియదని చెప్పారు. సీఎం రేవంత్ బ్లాక్‌మెయిల్ చేసి చర్యలు తీసుకునే వ్యక్తి అయితే నేరుగా చర్యలు తీసుకునేవారని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఆ విధానం ఉండదని, మంత్రి పదవి నుంచి తొలగించిన తర్వాత కొండా సురేఖ వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదన్నారు. పార్టీలో ఏమైనా సమస్యలు ఉంటే కూర్చుని మాట్లాడుకోవాలన్నారు.

మరోవైపు, ముఖ్యమంత్రిపై తన కుమార్తె చేసిన వ్యాఖ్యలను సురేఖ ఖండించలేదని మల్లు రవి మండిపడ్డారు. కొండా సురేఖపై తనకు ఫిర్యాదులు అందాయని, కోమటిరెడ్డి బ్రదర్స్‌పై ఫిర్యాదులు వస్తే వారిపైనా చర్యలు తీసుకుంటామని తేల్చి చెప్పారు. ఈ సందర్భంగా కొండా సురేఖ, మురళీ, చిన్నారెడ్డికి తాను వ్యక్తిగతంగా వ్యతిరేకం కాదన్నారు. సురేఖ చేసిన తప్పుల ఆధారంగానే చర్యలు తీసుకున్నామన్నారు. కులాల ఆధారంగా పార్టీలో చర్యలు ఉండవని, కుట్ర అని ఆమె అనుకుంటే తానేమీ చేయలేనన్నారు. సీఎంను ఏమైనా అంటే ఖండించాల్సిన బాధ్యత కేబినెట్ మంత్రిపై ఉంటుందన్నారు. తన కూతురు చేసింది తప్పు అని ఖర్గే దగ్గర కూడా సురేఖ చెప్పలేదన్నారు.

పార్టీకి వ్యతిరేకంగా ఎవరైనా మాట్లాడితే జిల్లా అధ్యక్షుడు, పీసీసీ అధ్యక్షుడు నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని మల్లు రవి చెప్పారు. పార్టీ నేతలు, కార్యకర్తలను ఉత్సాహపరచడానికే రేవంత్ రెడ్డి.. టికెట్ల ప్రకటన, సీఎంగా తానే ఉంటానని చెప్పారన్నారు. దానిని సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసమే ముఖ్యమంత్రి మాట్లాడుతున్నారనే తప్పా సొంత ప్రయోజనాల కోసం కాదన్నారు. సీఎంగా ఎవరుండాలి.. టికెట్ ఎవరికి ఇవ్వాలనే దానిపై కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయం తీసుకుంటుందన్నారు. కొండా సురేఖను మంత్రిగా తొలగించినా ఆమె పార్టీలోనే కొనసాగాలని కోరుకుంటున్నామని మల్లు రవి చెప్పుకొచ్చారు.

# స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**అక్షరశక్తి, వర్ధన్నపేట :** వర్ధన్నపేటలోని ఎంఎంఆర్ గార్డెన్స్ లో స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు గురువారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పంపిణీ చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి గ్రామానికి కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందుతున్నాయని అన్నారు. రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, స్మార్ట్ రేషన్ కార్డులు, సన్నబియ్యం వంటి పథకాలను పేదలకు అందిస్తున్నామని తెలిపారు.ప్రజలకు సంక్షేమ పథకాలు మరింత పారదర్శకంగా, సులభంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి పేద కుటుంబానికి న్యాయం చేయటమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ప్రభుత్వం పారదర్శకంగా అందించే సంక్షేమ పథకాలను ప్రజలు వినియోగించుకోవాలన్నారు.అనంతరం కాంగ్రెస్ 1000 రోజుల పాలన సంబరాలు వర్ధన్నపేట సెంటర్లో జరుపుకున్నారు.టపాకాసులు కాల్చి,పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, వైస్ చైర్మన్ నేతావాత్ శిభారాణి రాజేందర్, ఇల్లంద మార్కెట్ చైర్మెన్ నరకుడు వెంకటయ్య, సొసైటీ చైర్మెన్ రాజేష్ ఖన్నా, ఐనవోలు దేవస్థానం చైర్మెన్ ప్రభాకర్ గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి నిమ్మని శేఖర్ రావు, మండల అధ్యక్షులు పోశాల వెంకన్న, పట్టణ అధ్యక్షులు ఈగ దామోదర్, జిల్లా ఉపాధ్యక్షులు ఎద్దు సత్యానారాయణ, కౌన్సిలర్లు, సర్పంచులు, ఉపసర్పంచులు, డైరెక్టర్లు, వార్డు మెంబర్లు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పతనం ఖాయం

**అక్షరశక్తి, ములుగు :** రైతు లేనిదే రాజ్యం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల సవతి తల్లి ప్రేమను చూపుతోందని బి.ఆర్.ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మీనరసింహారావు, ములుగు నియోజకవర్గ ఇంచార్జ్ బడే నాగజ్యోతి అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు చేపడుతున్న నిరసన కార్యక్రమంలో భాగంగా గురువారం గోవిందరావుపేట మండల కేంద్రంలో బిఆర్ఎస్ నాయకులు రైతులతో కలిసి నిర్వహించిన నిరసన కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మీనరసింహారావు, నియోజకవర్గ ఇన్చార్జ్ బడే నాగజ్యోతి ముఖ్యఅతిథిగా హాజరై ర్యాలీ పాల్గొన్నారు. గోవిందరావుపేటలోని తహసిల్దార్ కార్యాలయం నుంచి ఎద్దుల బండ్ల తో మొదలైన ర్యాలీ గోవిందరావుపేట శివారులోని ఫంక్షన్ హాల్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు సమావేశంలో లక్ష్మీ నరసింహారావు, నాగజ్యోతి మాట్లాడారు. బిఆర్ఎస్ పార్టీ రైతుల సంక్షేమ ధ్యేయంగా రెండు గోపాలుగా పాలన అందించిందని అన్నారు. నేడు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వ పతనం ఖాయమని అన్నారు. ముఖ్యంగా ములుగు నియోజకవర్గంలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం, స్థానిక మంత్రి తక్షణమే స్పందించాలని డిమాండ్ వారు డిమాండ్ చేశారు. రైతుల సమస్యలకు పరిష్కారం చూపకుండా సభలు, సమావేశాలు, ఉపన్యాసాల పేరుతో కాలయాపన చేస్తూ, ప్రతి సమస్యకూ గత ప్రభుత్వాన్ని నిందించడం సరికాదని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తోందని వారు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు గోవింద నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# రైతుల కోసం చల్లా పోరుబాట







- దామెర నుండి నడికుడ వరకు ఎస్సారెస్పీ కాలువలో పాదయాత్ర
- స్వచ్ఛందంగా తరలిన రైతులు
- వర్షంలోనూ కొనసాగిన పాదయాత్ర..
- ఘన స్వాగతం పలికిన మహిళలు,రైతులు..
- ఎడ్లబండ్లతో.. ట్రాక్టర్లతో భారీ ర్యాలీ..

**అక్షరశక్తి, పరకాల :** రైతుల కన్నీటి గోస కాంగ్రెస్ ప్రభుత్వానికి తగులుతుందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల దగా పాలనలో రైతులను ఇచ్చిన హామీలతో మోసం చేసిందని ఆయన మండిపడ్డారు. గురువారం దామెర మండల కేంద్రంలోని ఎస్సారెస్పీ కాలువ నుంచి నడికుడ శివారు వరకు రైతులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. అనంతరం ట్రాక్టర్లు, ఎడ్లబండ్లతో భారీ ర్యాలీ చేపట్టి కాంగ్రెస్ ప్రభుత్వ 420 హామీలపై నిరసన తెలిపారు.

ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన రూ.2 లక్షల రుణమాఫీ హామీ ఏమైందని, రైతుభరోసా కింద ఇస్తామన్న రూ.15 వేలు ఇంకెప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. రైతుబంధును సీరియల్‌లా సాగదీస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. కౌలు రైతులకు ఇస్తామన్న రూ.12 వేల భరోసా, వరి పంటకు ప్రకటించిన రూ.500 బోనస్, రైతుబీమా హామీల పరిస్థితి ఏమిటో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. యూరియా కోసం రైతులు రోజుల తరబడి ఇబ్బందులు పడుతూ, చెప్పులు లైన్లో పెట్టుకునే దుస్థితి రావడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం వారిపై పోలీసులతో లాఠీచార్జీలు చేయించడం దారుణమన్నారు. "రైతు ఓటు కోసం హామీలు ఇవ్వడం కాదు.. రైతు పొలంలో పంట పండే వరకు ప్రభుత్వం అండగా నిలవాలి. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర, పెట్టుబడికి భరోసా, కష్టకాలంలో బీమా, అప్పుల్లో ఉన్నప్పుడు రుణమాఫీ.. ఇవే రైతుకు కావాల్సిన నిజమైన భరోసా" అని చల్లా ధర్మారెడ్డి అన్నారు.

బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ పాలనలో రైతు రాజులా బతికితే.. నేడు రేవంత్ రెడ్డి పాలనలో యూరియా కోసం చెప్పులు లైన్లో పెట్టుకునే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. రైతును మోసం చేయడం అంటే ఒక వ్యక్తిని మాత్రమే కాదు.. తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకైన రైతు కుటుంబాన్ని మోసం చేయడమేనన్నారు.



"రైతు చేతిలో నాగలి ఉండాలి.. కాంగ్రెస్ హామీల చీటీ కాదు. రైతు ఓట్లతో అధికారంలోకి వచ్చి రైతులనే మోసం చేస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరు" అని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి హామీలకు లెక్క లేదని, అమలుకు దిక్కు లేదని, రైతు సమస్యలకు పరిష్కారం లేదని చల్లా ధర్మారెడ్డి విమర్శించారు. రైతుల కన్నీటికి సమాధానం చెప్పే రోజు వస్తుందని, ప్రజలే కాంగ్రెస్ ప్రభుత్వానికి లెక్క చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు, రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కేయూ ఎల్.ఎల్.బి. పరీక్షలు వాయిదా

**అక్షరశక్తి, కేయూ క్యాంపస్ :** సెప్టెంబర్ 7, 8వ తేదీల్లో నిర్వహించాల్సిన కాకతీయ విశ్వవిద్యాలయ ఎల్.ఎల్.బి. (మూడేళ్ల కోర్సు) రెండో, నాల్గవ సెమిస్టర్ పరీక్షలు, అలాగే ఎల్.ఎల్.బి. (ఐదేళ్ల కోర్సు) ఆరవ, ఎనిమిదవ సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల ఒక ప్రకటనలో తెలిపారు. వాయిదా వేసిన పరీక్షలను తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు ఈ విషయాన్ని గమనించి, తదుపరి పరీక్షల తేదీల కోసం విశ్వవిద్యాలయ అధికారిక ప్రకటనలను పరిశీలించాలని సూచించారు.

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శికి కాంట్రాక్ట్ అధ్యాపకుల వినతి



**అక్షరశక్తి, హన్మకొండ :** తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీకి గురువారం నాడు హనుమకొండలో కలసి వినతి పత్రం అందించారు. తెలంగాణ రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాలలో కాంట్రాక్ట్ అధ్యాపకులుగా గత 27 సంవత్సరాల నుండి 1175 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులు పనిచేస్తున్నారు. యూనివర్సిటీలో పనిచేస్తున్న పార్ట్ టైం అధ్యాపకులకు 50వేల రూపాయలు నెలకు ఇవ్వాలని మరియు డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న గెస్ట్ అధ్యాపకులకు 50వేల రూపాయలు ఇవ్వాలని, జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న గెస్ట్ అధ్యాపకులకు 42 వేల రూపాయలు ఇచ్చే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ డాక్టర్ శ్రీధర్ కుమార్ లోధ్, ఆర్ట్స్ కళాశాల ఫ్యాకల్టీ క్లబ్ చైర్మన్ డాక్టర్ దామెర బిక్షపతి, డాక్టర్ పుల్లా రమేష్, డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ బండి శ్రీనివాస్, డాక్టర్ సదానందం, డాక్టర్ రాజు, డాక్టర్ హరీశంకర్, డాక్టర్ రవీందర్, డాక్టర్ వి నవీన్, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వెయ్యి రోజుల ప్రజాపాలన

- రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాది
- భూపాలపల్లి ఎమ్మెల్యే జీఎస్సార్



**అక్షరశక్తి, భూపాలపల్లి :** తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజాపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం చిట్యాల, రేగొండ మండల కేంద్రాల్లో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా గండ్ర సత్యనారాయణ రావు హాజరై పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల కాలంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తూ ముందుకు సాగుతోందన్నారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పాలన కొనసాగుతోందన్నారు.

భూపాలపల్లి నియోజకవర్గంలో గత పాలకులు ఆక్రమించిన భూములను తిరిగి స్వాధీనం చేసుకుని ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటుకు స్థలాలు కేటాయించి భవనాల నిర్మాణాలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే రేగొండ మండలంలోని కొడవటంచ,భూగులోని జాతర, పాండవుల గుట్టలను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, భూపాలపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుటోజు కిష్టయ్య, చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి, కొడవటంచ ఆలయ కమిటీ చైర్మన్ నాయినేని సంపత్ రావు, ఆయా మండలాల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు,కార్యకర్తలు, మహిళలు, యువకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

GUEST COLUMN

# చరిత్రను మలిచే శక్తి యువతకే ఉంది

*భారతదేశ చరిత్రను పరిశీలిస్తే ఒక విషయం స్పష్టంగా కనిపిస్తుంది. అధికారం ఎంత బలంగా ఉన్నా, అన్యాయం ఎంత వ్యవస్థీకృతంగా ఉన్నా, దోపిడీ ఎంతకాలం కొనసాగినా దానికి ఎదురొడ్డి నిలిచిన శక్తుల్లో యువత ఎప్పుడూ ముందువరుసలో ఉంది. విద్యార్థులు కేవలం పుస్తకాలు చదివే తరగతి గది పౌరులు కాదు. సమాజం ఎలా ఉండాలి, దేశ భవిష్యత్తు ఎలా ఉండాలి అనే ప్రశ్నలను అత్యంత తీవ్రంగా ఆలోచించే తరం కూడా వారే.*

భారత స్వాతంత్ర్యోద్యమంలోనే ఈ సంప్రదాయానికి బలమైన పునాదులు పడ్డాయి. 1905 స్వదేశీ ఉద్యమం నుంచి సహాయ నిరాకరణ, శాసనోల్లంఘన, క్విట్ ఇండియా ఉద్యమాల వరకు విద్యార్థులు బ్రిటిష్ విద్యాసంస్థలను బహిష్కరించడం, ప్రదర్శనలు నిర్వహించడం, జాతీయ భావాలను ప్రచారం చేయడం, అరెస్టులు ఎదుర్కోవడం వంటి అనేక రూపాల్లో పాల్గొన్నారు. 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో ప్రధాన నాయకులను బ్రిటిష్ ప్రభుత్వం జైలుకు పంపిన తర్వాత కూడా అనేక ప్రాంతాల్లో ఉద్యమాన్ని కొనసాగించడంలో విద్యార్థుల పాత్ర కనిపించింది. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లాలో విద్యార్థులు చదువులు వదిలి ఉద్యమంలోకి వచ్చారని భారత ప్రభుత్వానికి చెందిన చారిత్రక రికార్డులు కూడా నమోదు చేస్తున్నాయి.

ఈ ఉద్యమం ఒక్క రాజకీయ సిద్ధాంతానికి పరిమితం కాలేదు. గాంధేయవాదం, సామ్యవాదం, కమ్యూనిజం, విప్లవవాదం వంటి భిన్న రాజకీయ ధోరణులు యువతను ఆకర్షించాయి. 1936లో లక్నోలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏర్పడటం విద్యార్థి రాజకీయాలకు జాతీయ స్థాయి సంస్థాగత రూపాన్ని ఇచ్చిన ముఖ్యమైన పరిణామం. అస్సాంలో విద్యార్థి సంఘాలు సామాజిక, ఆర్థిక, కార్మిక సమస్యలపై కూడా స్పందించాయి. 1939లో అస్సాం విద్యార్థులు డిగ్‌బోయ్ కార్మికుల సమ్మెకు మద్దతు ప్రకటించడం, విద్యార్థి సమస్యలను సమాజ సమస్యలతో అనుసంధానించిన దానికి ఉదాహరణ.

ఈ చరిత్రలో భగత్ సింగ్ స్థానం ప్రత్యేకమైనది. ఆయన యువతను కేవలం ధైర్యసాహసాలకు ప్రతీకగా చూడలేదు. చదవడం, ఆలోచించడం, రాజకీయ అవగాహన పెంచుకోవడం, సంఘటితం కావడం ద్వారా మాత్రమే యువత సమాజాన్ని మార్చగలదని విశ్వసించారు. 1931లో రాసిన 'యువ రాజకీయ కార్యకర్తలకు' అనే రచనలో ఆయన రాజకీయ విద్య, అధ్యయనం, ప్రజలతో సంబంధం, సంఘటిత కార్యాచరణకు ప్రాధాన్యం ఇచ్చారు. అందుకే భగత్ సింగ్ వారసత్వం అంటే కేవలం త్యాగాన్ని స్మరించుకోవడం మాత్రమే కాదు. అన్యాయం ఎందుకు జరుగుతోంది, దాన్ని మార్చేందుకు ఎలాంటి సమాజాన్ని నిర్మించాలి అనే ప్రశ్నలను ఆలోచించడం కూడా.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా విద్యార్థి ఉద్యమాల ప్రవాహం ఆగలేదు. 1960వ దశకంలో తమిళనాడులో హిందీ వ్యతిరేక ఉద్యమాల్లో విద్యార్థులు భారీగా పాల్గొన్నారు. భాష, ప్రాంతీయ హక్కులు, సమాఖ్య వ్యవస్థ వంటి ప్రశ్నలు విద్యార్థి రాజకీయాల్లోకి వచ్చాయి. 1974లో గుజరాత్‌లో పెరుగుతున్న ధరలు, అవినీతి, ప్రభుత్వ వైఫల్యాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రారంభమైన నవనిర్మాణ ఉద్యమం రాష్ట్ర రాజకీయాలను కుదిపేసింది. ఆ ఉద్యమం ముఖ్యమంత్రి రాజీనామా, అసెంబ్లీ రద్దు వరకు వెళ్లింది. అదే సంవత్సరం బీహార్‌లో ధరల పెరుగుదల, నిరుద్యోగం, అవినీతికి వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించి జయప్రకాశ్ నారాయణ్ నాయకత్వంలో విస్తృత ప్రజా ఉద్యమంగా మారారు.

అయితే విద్యార్థి ఉద్యమాల చరిత్రను పూర్తిగా రొమాంటిక్‌గా చూడటం కూడా సరైంది కాదు. కొన్ని ఉద్యమాలు రాజకీయ పార్టీల చేతుల్లోకి వెళ్లాయి. కొన్ని చోట్ల హింస చోటుచేసుకుంది. కొన్ని సందర్భాల్లో విద్యార్థుల సహజ అసంతృప్తిని రాజకీయ శక్తులు తమ ప్రయోజనాలకు ఉపయోగించుకున్నాయి. 1974 గుజరాత్ ఉద్యమంలోనే వివిధ రాజకీయ శక్తుల పాత్రపై చారిత్రక చర్చ ఉంది. అందువల్ల విద్యార్థి ఉద్యమానికి నిజమైన బలం పార్టీ జెండాలో కాదు; స్వతంత్ర ఆలోచనలో, ప్రజాస్వామ్య పద్ధతుల్లో, వాస్తవాల ఆధారంగా ప్రశ్నించడంలో ఉంటుంది.

ఇప్పటి పరిస్థితుల్లో ఈ ప్రశ్న మరింత ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. విద్య అంటే కేవలం డిగ్రీ కాదు. అది కోట్లాది కుటుంబాల భవిష్యత్తుకు పెట్టుబడి. పరీక్షా వ్యవస్థపై నమ్మకం దెబ్బతింటే ఒక విద్యార్థి మాత్రమే కాదు, అతని కుటుంబం మొత్తం దెబ్బతింటుంది. జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల నిర్వహణలో అవకతవకలు, ప్రశ్నపత్రాల లీకేజీ, ఫలితాలపై అనుమానాలు వంటి పరిణామాలు విద్యార్థుల్లో తీవ్ర ఆందోళనకు కారణమయ్యాయి. 2026లో నీట్-యూజీ వివాదం నేపథ్యంలో దేశవ్యాప్తంగా జరిగిన విద్యార్థి నిరసనలు కాక్రోచ్ జనతాపార్టీ ఉద్యమం రూపంలో చివరకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు దారితీశాయి. అనంతరం జాతీయ పరీక్షా సంస్థలో 47 మంది అధికారులపై చర్యలు తీసుకున్నట్లు వార్తలు వచ్చాయి.

ఈ పరిణామాన్ని ఒక మంత్రి రాజీనామాగా మాత్రమే చూడటం పొరపాటు. ఇది ప్రజాస్వామ్యంలో జవాబుదారీతనం అనే సూత్రానికి సంబంధించిన ప్రశ్న. పరీక్ష రాసే విద్యార్థి తన శ్రమకు న్యాయం జరుగుతుందని నమ్మాలి. ప్రభుత్వం నిర్వహించే వ్యవస్థపై నమ్మకం లేకపోతే ప్రతిభకు అర్థం ఉండదు. అందుకే పారదర్శకత, స్వతంత్ర పర్యవేక్షణ, సాంకేతిక భద్రత, వేగవంతమైన న్యాయపరిష్కారం వంటి సంస్కరణలు అవసరం.

కానీ విద్యార్థుల సమస్యలు పరీక్షలతో ముగియవు. విద్య ఖరీదవుతోంది. ప్రభుత్వ విద్యాసంస్థలు వనరుల కొరతను ఎదుర్కొంటున్నాయి. మరోవైపు డిగ్రీలు పెరుగుతున్నప్పటికీ తగిన నాణ్యమైన ఉపాధి అవకాశాలపై యువతలో ఆందోళన ఉంది. కుల వివక్ష, లింగ వివక్ష, మతపరమైన ఉద్రిక్తతలు క్యాంపస్‌లలోకి వస్తే విద్యాస్వేచ్ఛ దెబ్బతింటుంది. ప్రభుత్వ సంస్థల స్వయం ప్రతిపత్తి బలహీనపడితే విద్యార్థుల భవిష్యత్తే ప్రభావితమవుతుంది.

అందుకే నేటి యువత ముందు ఉన్న బాధ్యత కేవలం తమ వ్యక్తిగత ఉద్యోగం కోసం పోరాడటం కాదు. విద్యా వ్యవస్థను న్యాయంగా, పారదర్శకంగా మార్చాలని కోరడం; నిరుద్యోగంపై ప్రశ్నించడం,సామాజిక వివక్షను వ్యతిరేకించడం, ప్రభుత్వ సంస్థల జవాబుదారీతనాన్ని డిమాండ్ చేయడం, రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కాపాడటం కూడా వారి బాధ్యత. అయితే ఈ పోరాటం ద్వేషంతో కాకుండా ప్రజాస్వామ్య పద్ధతుల్లో సాగాలి. ప్రత్యర్థిని దేశద్రోహిగా ముద్రించడం ఎంత తప్పో, విభిన్న అభిప్రాయాలను అణచివేయడం కూడా అంతే తప్పు.

ఈ సందర్భంలో భగత్ సింగ్ ఆలోచనలను మరోసారి గుర్తు చేసుకోవాలి. యువతలో ఆగ్రహం ఉండటం మంచిదే. కానీ ఆ ఆగ్రహానికి జ్ఞానం, చరిత్రపై అవగాహన, సామాజిక స్పృహ, రాజకీయ స్పష్టత జత కావాలి. లేకపోతే యువశక్తి సులభంగా ప్రచారానికి, మత విద్వేషానికి, రాజకీయ మాయాజాలానికి బలవుతుంది. చదివే యువతను ఆలోచించే యువతగా, ఆలోచించే యువతను ప్రశ్నించే యువతగా, ప్రశ్నించే యువతను బాధ్యతాయుతమైన పౌరులుగా మార్చడమే నిజమైన విద్య యొక్క కర్తవ్యం.

భారతదేశం స్వాతంత్ర్యం సాధించి ఎనిమిది దశాబ్దాల దిశగా సాగుతున్న సమయంలో మన ముందున్న పోరాటం బ్రిటిష్ పాలనకు వ్యతిరేకమైనది కాదు. ఇప్పుడు పోరాటం ప్రజాస్వామ్య సంస్థలను బలహీనపరిచే ధోరణులకు, అసమానతలకు, నిరుద్యోగానికి, విద్యా వ్యాపారీకరణకు, సామాజిక ద్వేషానికి, అధికార కేంద్రీకరణకు వ్యతిరేకంగా సాగాలి. ఏ రాజకీయ పార్టీ అధికారంలో ఉన్నా ఇదే ప్రజాస్వామ్య ప్రమాణాలతో, స్ఫూర్తితో కొనసాగించాలి. ఆర్ఎస్ఎస్-బీజేపీ అధికారాన్ని ప్రశ్నించడం అయినా, కాంగ్రెస్ లేదా మరే ఇతర పార్టీని ప్రశ్నించడం అయినా యువత ప్రమాణం పార్టీ విధేయతగా కాకుండా రాజ్యాంగ విలువలకు లక్ష్యాలకు, స్ఫూర్తికి అంకితం కావాలి.

చరిత్రలో ప్రతి తరానికి ఒక పరీక్ష ఎదురైంది. స్వాతంత్ర్యోద్యమ కాలంలో యువత విదేశీ పాలనను సవాలు చేసింది. 1970లలో అవినీతి, నిరంకుశత్వాన్ని ప్రశ్నించింది. వివిధ దశల్లో భాష, సామాజిక న్యాయం, పౌరహక్కులు, విద్యా హక్కుల కోసం పోరాడింది. ఇప్పుడు పరీక్ష కొత్తది. సాంకేతికత చేతిలో ఉంది, సమాచారానికి అపారమైన జ్ఞాన సంపదకు అనేక మార్గాలు అందుబాటులో ఉన్నాయి, కానీ అదే సమయంలో తప్పుడు సమాచారం, ద్వేష ప్రచారం కూడా అపారంగా వ్యాపిస్తున్నాయి.

అందువల్ల నేటి విద్యార్థి ఉద్యమానికి అసలైన అర్థం ఒక ప్రభుత్వాన్ని కూల్చడం కాదు. ప్రభుత్వాలను ప్రజలకు జవాబుదారీగా ఉంచే ప్రజాస్వామ్య సంస్కృతిని బలోపేతం చేయడం. ఒక మంత్రి రాజీనామా చేయడం విజయానికి సంకేతం కావచ్చు. కానీ, పారదర్శకమైన వ్యవస్థను నిర్మించడం అసలైన విజయం. ఒక పరీక్ష రద్దు కావడం పరిష్కారం కావచ్చు. కానీ భవిష్యత్తులో అక్రమాలకు అవకాశం లేకుండా వ్యవస్థను మార్చడం శాశ్వత పరిష్కారం.

యువత చరిత్రలో కేవలం ప్రేక్షకులు కాదు. చరిత్రను రాసినవారు. ఆ చరిత్ర వారసత్వాన్ని కేవలం నినాదాల్లో కాకుండా వివేకంలో, ఐక్యతలో, ప్రశ్నించే ధైర్యంలో, ప్రజాస్వామ్య విలువల పట్ల నిబద్ధతలో కొనసాగించాల్సిన సమయం ఇది. దేశ భవిష్యత్తు ఎవరో ఒక నాయకుడి చేతుల్లో మాత్రమే లేదు. కోట్లాది యువత ఏ దేశాన్ని కోరుకుంటుందో, దాని కోసం ఎంత బాధ్యతగా నిలబడుతుందో దానిపైనే భారతదేశ రేపటి చరిత్ర ఆధారపడి ఉంటుంది.



- డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.
ramkishore.1504@gmail.com

Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.